వాడవాడలా అన్న సమారాధనలు



వైఎస్సార్ కాలనీలో అన్నప్రసాదం వడ్డిస్తున్న సీఐ బాలకృష్ణ తదితరులు

మధురవాడ: గణపతి నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా వాడవాడలా అన్నసమారాధనలు నిర్వహించారు. వైఎస్సార్ కాలనీలో వైఎస్సార్ నగర్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అన్నసమారాధనను పీఎం పాలెం సీఐ బాలకృష్ణ, ఎస్ఐ భాస్కరరావు ప్రారంభించారు. పరిసర ప్రాంతాల నుంచి సుమారు 3వేల మంది హాజరై అన్నప్రసాదం స్వీకరించారు. కార్యక్రమానికి సహాయ సహకారాలు అందించిన పిళ్లా యోగేశ్వర రావు, బాగాది లక్ష్మణ, కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు, యువత పాల్గొన్నారు.

- స్వతంత్రనగర్‌లో క్రేజీ బాయ్స్ అండ్ గరల్స్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అన్న సమారాధనలో 3 వేల మంది అన్నప్రసాదం స్వీకరించారు. టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

జేఎస్ఎస్‌యూఆర్‌ఎం కాలనీలో..



గాయత్రీనగర్‌లో..

పీఎం పాలెం: జీవీఎంసీ ఆరో వార్డు జేఎస్ఎస్ యూఆర్‌ఎం కాలనీలో ఏర్పాటు చేసిన నారాయణ సేవలో వైఎస్సార్ సీపీ నాయకుడు శివకుమార్, అప్పారావు తదితరులు పాల్గొన్నారు

తగరపువలస: భీమిలి, ఆనందపురం మండలాల్లో పలుచోట్ల నిర్వాహకులు నారాయణసేవ నిర్వహించారు. ఆనందపురం బీసీ కాలనీలో భారీ అన్న సమారాధన జరిగింది. జీవీఎంసీ ఒకటోవార్డు బాలాజీనగర్ యాతపేటలో, రెండోవార్డు రెడ్డివీధి సంతపేట, జీరుపేట గ్రామాల్లో నిర్వాహకులు భారీ ఎత్తున అన్నదానం చేశారు.

ఉపాధ్యాయుల కుటుంబం

- ఒకే కుటుంబంలో ఏడుగురు ఉపాధ్యాయులు
- నిరక్షరాస్యులైన తల్లిదండ్రులు సాధించిన విజయం



రెడ్డిపల్లి సన్యాసిరావు, ఆదిలక్ష్మి దంపతులు

తగరపువలస: వారు చదువుకు దూరమయ్యారు., కూలి పనులకే పరిమితమయ్యారు..అయితే తమ పిల్లల చదువు కోసం చూపిన త్యాగం ఎప్పటికీ ఆదర్శనీయం. పద్మనాభం మండలం రెడ్డిపల్లికి చెందిన నిరక్షరాస్యులైన రెడ్డిపల్లి సన్యాసిరావు, ఆదిలక్ష్మి దంపతులు తమ కష్టంతో అలాంటి అద్భుతాన్నే సృష్టించారు. వ్యవసాయ కూలీలుగా మొదలైన వారి జీవితం, నేడు ఒకే కుటుంబంలో ఏడుగురు ప్రభుత్వ ఉపాధ్యాయులను, ఒక బ్యాంకు ఉద్యోగిని చూస్తుండడంతోనే ఎంతో ఆనందానికి లోనవుతున్నారు.

50 ఏళ్ల క్రితం వ్యవసాయ కూలీలుగా జీవితం ప్రారంభించిన ఈ దంపతులు, తమ అపారమైన కష్టంతో రెండు ఎకరాల భూమిని సంపాదించారు. తమ పిల్లల భవిష్యత్తు కోసం ఆ భూమిని కూడా



రమేష్, అప్పలరాజు, ప్రసాదరావు, త్రినాథరావు, శ్రీనివాసరావు

కరిగించి వారి చదువుకు వెచ్చించారు. ఫలితంగా వారి ఐదుగురు కుమారులు ప్రభుత్వ ఉపాధ్యాయులుగా జీవితంలో స్థిరపడ్డారు. 1998 డీఎస్సీలో పెద్ద కుమారుడు శ్రీనివాసరావు మన్యం జిల్లా కొమరాడలో, రెండో కుమారుడు త్రినాథరావు విజయనగరం జిల్లా చీపురుపల్లిలో ఉపాధ్యాయులుగా ఎంపికయ్యారు. 2008 డీఎస్సీలో మూడో కుమారుడు ప్రసాదరావు విజయనగరం జిల్లా మెరక ముడిదాంలో, నాలుగో కుమారుడు అప్పలరాజు జీవీఎంసీ భీమిలి జోన్‌లో, ఐదో కుమారుడు రమేష్ విజయనగరం జిల్లా జామిలో ఉద్యోగాలు సాధించారు.

కోడళ్లు కూడా ఉద్యోగులే..

ఈ కుటుంబంలో వారి పిల్లలు మాత్రమే కాదు.. వారి కోడళ్లు కూడా ఉన్నత స్థానాల్లో ఉన్నారు. త్రినాథరావు భార్య సుజాత విజయనగరం జిల్లా దత్తిరాజేరు మండలంలో ఉపాధ్యాయురాలిగా, అప్పలరాజు భార్య మద్దిరెడ్డి సంతోషికుమారి పద్మనాభం మండలంలో ఉపాధ్యాయురాలిగా విధులు నిర్వర్తిస్తున్నారు. అలాగే రమేష్ భార్య జి. నిర్మల గరివిడిలోని సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో ఉద్యోగినిగా పనిచేస్తున్నారు.

తల్లిదండ్రులే గురుబ్రహ్మలు

సన్యాసిరావు, ఆదిలక్ష్మి చదువుకోకపోయినా తమ పిల్లలకు అక్షర జ్ఞానమే కాదు, జీవితాన్ని ఎలా నిర్మించుకోవాలో నేర్పించారు. వారి త్యాగం, కష్టం ఈ కుటుంబానికి మార్గదర్శమయ్యాయి. ఈ కుటుంబాన్ని చూసి ఉత్తరాంధ్రలోని యువత ఉద్యోగాల కోసం ప్రేరణ పొందుతున్నారు. ఒక నిరక్షరాస్యులైన దంపతులు తమ కష్టంతో చూపిన ఈ గొప్ప విజయం, ఈ త్యాగమూర్తులను గురుబ్రహ్మలుగా తీర్చిదిద్దింది.

మా కుటుంబం చేసుకున్న పుణ్యమే



ఒక ఇంట్లో ఒక ఉద్యోగమే గగనమైన రోజుల్లో 27 ఏళ్ల క్రితం ఇద్దరు, 17 ఏళ్ల క్రితం ముగ్గురికి సమాజాన్ని సరిదిద్దే ఉపాధ్యాయ ఉద్యోగాలు రావడం ఇదంతా మా అత్తామామల పుణ్యమే.

–సంతోషికుమారి, ఉపాధ్యాయురాలు, రౌతులపాలెం పద్మనాభం

మాకు వసతులు కల్పిస్తారా? లేదా?

ఎమ్మెల్యే గంటాను నిలదీసిన అప్పడువారి కళ్లాల ప్రజలు



తాగునీరు, రహదారి కోసం ఎమ్మెల్యే గంటాను నిలదీస్తున్న మహిళలు

తగరపువలస: ఆనందపురంలో గురువారం పీఏసీఎస్ చైర్మన్ల ప్రమాణ స్వీకారానికి వచ్చిన ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావుకు అప్పడువారి కళ్లాల ప్రజల సెగ తగిలింది. ఆనందపురం పంచాయతీలోని ఈ కళ్లాలలో 30 కుటుంబాల ప్రజలు 40 ఏళ్ల నుంచి జీవిస్తున్నారు. వీరి నివాసాలకు తాగునీరు, రహదారి సౌకర్యం లేక ఇబ్బంది పడుతున్నారు. 2014–19 టీడీపీ హయాంలో గంటా శ్రీనివాసరావు మంత్రిగా ఉన్నప్పుడు కూడా వీళ్లు ఇవే వసతుల కోసం సంప్రదించారు.

మరోమారు వినతి

గురువారం పంచాయతీలో గంటా శ్రీనివాసరావు పర్యటిస్తున్నారని తెలుసుకున్న మహిళలు ఇక్కడ ప్రైవేట్ ఫంక్షన్ హాల్లో కార్యక్రమం జరుగుతుండగా మరోమారు ఈ వసతులపై వినతిపత్రం అందించారు. అసలు తమకు వసతులు కల్పిస్తారా, కల్పించరా అంటూ గట్టిగా అడిగారు. అక్కడ మండల పరిషత్ అధికారులు లేకపోవడంతో అసహనం వ్యక్తం చేసిన ఆయన చూద్దాం, చేద్దాం అనడంతో అప్పడువారి కళ్లాల ప్రజలు విసురుగా వెళ్లిపోయారు. కలెక్టర్‌ను కలిసి తమ సమస్య చెప్పుకుంటామని వారు తెలిపారు.

మధురవాడ డిపో మేనేజర్‌గా సత్య కనకదుర్గ



బాధ్యతలు స్వీకరిస్తున్న సత్య కనకదుర్గ

మధురవాడ: ఏపీఎస్ఆర్టీసీ మధురవాడ డిపో మేనేజర్‌గా ఈలేటి సత్య కనకదుర్గ బాధ్యతలు స్వీకరించారు. ఆమె పార్వతీపురం డిపో నుంచి బదిలీపై వచ్చారు. ఇప్పటి వరకు విశాఖ-1 డిపో మేనేజర్ ఇన్‌చార్జి బాధ్యతలు నిర్వహించేవారు. కనకదుర్గకు సిబ్బంది పుష్పగుచ్ఛాలతో స్వాగతం పలికారు. ఆమె మాట్లాడుతూ ప్రయాణికులకు మరింత మెరుగైన సేవలు అందిస్తానని, అధికారులు, సిబ్బందితో కలసి సంస్థ అభివృద్ధికి కృషి చేస్తామని తెలిపారు.

సహకార సంఘాలు రైతులకు అండగా నిలవాలి



పీఏసీఎస్ చైర్మన్ల ప్రమాణ స్వీకార కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గంటా

తగరపువలస: సహకార సంఘాలు రైతులకు అండగా నిలవాలని ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు కోరారు. ఆనందపురంలో జిల్లా కేంద్ర సహకార బ్యాంకు నూతన బ్రాంచ్‌ను ప్రారంభించిన ఆయన ఇటీవల కొత్తగా నియమితులైన సహకార సంఘాల నూతన చైర్మన్లు, డైరెక్టర్ల ప్రమాణ స్వీకార కార్యక్రమంలో పాల్గొన్నారు. నియోజకవర్గంలో 9 సంఘాల చైర్మన్లతో ప్రమాణం చేయించారు. కార్యక్రమంలో కూటమి నాయకులు పాల్గొన్నారు.

లక్ష్యంపై స్పష్టత, క్రమశిక్షణ ఉంటే విజయాలు సొంతం

జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్



మాట్లాడుతున్న జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్

కొమ్మాది: జీవిత లక్ష్యాలపై స్పష్టమైన అవగాహన, వాటిని సాధించడానికి దృఢ సంకల్పం ఉంటే ఐఏఎస్ వంటివి సాధించడం కష్టం కాదని జీవీఎంసీ కమిషనర్ కేతన్‌గార్గ్ అన్నారు. గీతంలో నిర్వహించిన ఓ కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. తనది రాజస్థాన్‌లోని మారుమూల గ్రామమని తెలిపారు. బ్యాంక్ ఆఫీసర్ ఉద్యోగం వదులుకున్నానని, వివిధ ప్రభుత్వ ఉద్యోగాల్లో పని చేస్తూ ఏ విధమైన శిక్షణ లేకుండా సివిల్స్‌లో విజయం సాధించి, ఐఏఎస్‌కు ఎంపికైన తీరును ఆయన వివరించారు. జీవితంలో పోటీ అనేది లక్ష్యాలు సాధించడానికి ముందు, ఆ తరువాత కూడా ఎదుర్కోవాల్సి ఉంటుందని తెలిపారు. విద్యార్థులు జీవితంలో తాము ఏమి సాధించాలనే లక్ష్యం పట్ల స్పష్టత కలిగి ఉండాలని, అందుకు తగిన విధంగా క్రమశిక్షణతో కృషి చేయాలని, అప్పుడే విజయాలు దరి చేరుతాయని అన్నారు.

గురువులను దైవంగా పూజించే దేశం మనది



కృష్ణా విశ్వవిద్యాలయం మాజీ వీసీ రామకృష్ణను సత్కరిస్తున్న దృశ్యం

పీఎం పాలెం: గురువులను దైవంగా పూజించే విద్యార్థులున్న దేశంగా భారతదేశం చరిత్రపుటల్లో నిలిచిందని కృష్ణా యూనివర్సిటీ మాజీ వీసీ రామకృష్ణ అన్నారు. ఆళ్వార్ విద్యాసంస్థల ఆధ్వర్యంలో శ్రీనివాస ఇనిస్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ స్టడీస్ (సిమ్స్)కళాశాల ఆవరణలో గురువారం నిర్వహించిన గురుపూజోత్సవంలో ఆయన మాట్లాడుతూ గురుశిష్యుల అనుబంధాన్ని వివరించారు. కళాశాల ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లు దీపికాదాస్, దివ్యాదాస్, సూర్యతేజ, డాక్టర్ సుంకరి రవీంద్ర, విజయా రవీంద్ర, ఎన్‌వీపీ లా కళాశాల, సీఎంటీ, గ్రీన్ డేల్ స్కూల్, సమతా లా కాలేజీల బోధనా సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



• దేదీప్యమానం

దీపకాంతుల్లో గణనాథుడు దేదీప్యమానంగా ప్రకాశించారు. 4వ వార్డు కె.నగరపాలెం పరిధి నర్సింహానగర్‌లో మండపం వద్ద దీపారాధన ఆకట్టుకుంది. వివిధ వర్ణాలతో వినాయకుడి రూపం చిత్రించి, 501 దీపాలతో అలంకరించారు. దీపారాధనలో అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు. - కొమ్మాది

ఉపాధ్యాయుల పాత్ర ఉన్నతం



కార్యక్రమంలో ఉపాధ్యాయుల గురించి వివరిస్తున్న ప్రిన్సిపాల్ శ్రీవాణి

తగరపువలస: విద్యార్థులను తీర్చిదిద్దడంలో గురువుల పాత్ర ఉన్నతమని చిట్టివలస ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ పి.శ్రీవాణి అన్నారు. కళాశాలలో గురువారం నిర్వహించిన ఉపాధ్యాయ దినోత్సవ కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ఉపాధ్యాయ దినోత్సవం అనేది వేడుక కాదని, విద్య యొక్క రూపాంతర శక్తిని, ఉపాధ్యాయుల పాత్రను గుర్తు చేసే రోజన్నారు. అనంతరం విద్యార్థులకు, అధ్యాపకులకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. అధ్యాపకుడు బి.సీతన్నాయుడు తదితరులు గురువు ఔన్నత్యం గురించి వివరించారు. విద్యార్థులు ఉన్నతంగా ఎదగడమే గురువు ఆకాంక్ష అని పేర్కొన్నారు.

ఇగ్నో నర్సింగ్ కోర్సులో 30 మందికి ప్రవేశాలు

ఎంవీపీకాలనీ: ఇందిరా గాంధీ జాతీయ సార్వత్రిక విశ్వవిద్యాలయం(ఇగ్నో) నిర్వహిస్తున్న బీఎస్సీ నర్సింగ్ కోర్సులో 30 మంది ప్రవేశం పొందారు. మార్చిలో జరిగిన ప్రవేశ పరీక్షలో విద్యార్థులు సాధించిన మెరిట్ ఆధారంగా గురువారం కౌన్సెలింగ్ నిర్వహించి అడ్మిషన్లు ఇచ్చినట్లు ఇగ్నో విశాఖపట్నం ప్రాంతీయ కేంద్రం సంచాలకుడు డాక్టర్ గోనిపాటి ధర్మారావు తెలిపారు. ఇగ్నో అందిస్తున్న ఇతర పీజీ, డిగ్రీ కోర్సుల ప్రవేశాలకు ఈ నెల 15వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చని ఆయన వెల్లడించారు.













ఎస్‌డబ్ల్యూపీసీ నుంచి వర్మి కంపోస్ట్ విక్రయాలు

తగరపువలస: సాలిడ్ వేస్ట్ ప్రాసెసింగ్ సెంటర్ల (ఎస్‌డబ్ల్యూపీసీ)లో తయారైన వర్మీ కంపోస్ట్ విక్రయాలపై కలెక్టర్‌తో మాట్లాడి సదుపాయాలు కల్పిస్తామని డీఎల్‌డీవో జిల్లా ఇన్‌చార్జి సి.ఉషారాణి తెలిపారు. గురువారం ఆమె ఆనందపురం మండలం గంభీరం, వెల్లంకి పంచాయతీలలోని సాలిడ్ వేస్ట్ ప్రాసెసింగ్ సెంటర్లను పరిశీలించారు. అలాగే ఇళ్ల నుంచి చెత్త సేకరిస్తున్న విధానాన్ని కూడా పరిశీలించారు. గ్రీన్‌గార్డుల పనితీరును చూసి సూచనలు చేశారు. తయారైన వర్మీ కంపోస్ట్ వివరాలు అడిగి తెలుసుకున్నారు.









భారీ గణనాథుడి నిమజ్జనం రేపు

- చంద్రగ్రహణం కారణంగా తేదీ మార్పు
- నేడు అన్న సమారాధన



వినాయక మండపంలో వివరాలు వెల్లడిస్తున్న అర్చకులు, కమిటీ సభ్యులు

మధురవాడ: చంద్రంపాలెం గ్రామంలో శ్రీ శివనందన ప్రియ నామంతో 41 అడుగులతో రూపొందించిన భారీ వినాయకుడి నిమజ్జనాన్ని శనివారం నిర్వహించనున్నట్లు నిర్వహణ కమిటీ సభ్యులు, అర్చకులు తెలిపారు. చంద్రగ్రహణం నేపథ్యంలో ఈ మార్పు చేసినట్లు గురువారం సాయంత్రం వెల్లడించారు. ముందుగా ఈ నెల 14న వినాయక విగ్రహాన్ని నిమజ్జనం చేయాలని భావించినా, చంద్రగ్రహణం కారణంగా 6వ తేదీకి మార్చినట్లు చెప్పారు. అదే రోజు రాత్రి లడ్డూవేలం ఉంటుందన్నారు. 5వ తేదీ శుక్రవారం ఉదయం మండపంలో కుంకుమ పూజలు, మధ్యాహ్నం అన్న సమారాధన నిర్వహిస్తున్నామని తెలియజేశారు. భక్తులు గమనించాలని, కార్యక్రమాల్లో పాల్గొనాలని కోరారు.

ఉచిత కంటి, చర్మ వైద్య పరీక్షలు నేడు

తగరపువలస: జీవీఎంసీ రెండోవార్డు జీరుపేట గణపతి మండపం వద్ద శుక్రవారం ఉదయం 10 గంటల నుంచి మధురవాడ నియోవిజన్ స్పెషాలిటీ ఆస్పత్రి వైద్యులచే ఉచితంగా కంటి, చర్మ వైద్య పరీక్షలు చేయనున్నారు. అవసరమైన వారికి ఉచితంగా శస్త్రచికిత్సలు కూడా చేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. వివరాలకు దల్లి అప్పలరెడ్డిని 97042 81251 నంబరులో సంప్రదించాలని సూచించారు.

జోన్–2లో 99 టిడ్కో ఇళ్ల రద్దు

అభ్యంతరాల స్వీకరణకు గడువు ఈ నెల 11

మధురవాడ: జీవీఎంసీ జోన్–2 పరిధిలో 99 ఇళ్లు రద్దు చేస్తున్నట్లు జోన్–2 ఏపీడీ గురువారం ప్రకటనలో తెలిపారు. నగరంలో పీఎంఏవైయూ–ఎన్‌టీఆర్‌నగర్–ఏపీ టిడ్కో గృహ సముదాయం కింద 24,192మందికి ఇళ్లు కేటాయించినట్లు పేర్కొన్నారు. ఇందులో బ్యాంక్ సిబిల్ స్కోరు, వయసు పైబడిన వారు, వలస వెళ్లిపోయిన వారు, ఆసక్తి లేని వారు 215 మంది ఉన్నారని తెలిపారు. లబ్ధిదారుడు మరణించడం, వారి కుటుంబ సభ్యుల పేరు మీద మార్చమని వచ్చిన దరఖాస్తులు 123 ఉన్నాయని తెలియజేశారు. అందులో జీవీఎంసీ మధురవాడ జోన్–2 పరిధిలో 99 మంది ఉన్నారని పేర్కొన్నారు. వీరి ఇళ్లు రద్దు చేస్తున్నామని, ఏమైనా అభ్యంతరాలు ఉంటే ఈ నెల 11వ తేదీ 4గంటల లోపు తెలియపరచాలని కోరారు. మరిన్ని వివరాలకు మధురవాడ జోన్ కార్యాలయం యూసీడీ విభాగంలో సంప్రదించాలని సూచించారు.

పేద మహిళలకు చీరల పంపిణీ



చీరలు పంపిణీ చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

తగరపువలస: వైఎస్సార్‌సీపీ భీమిలి సమన్వయకర్త మజ్జి శ్రీనివాసరావు పుట్టినరోజు సందర్భంగా పార్టీ జీవీఎంసీ రెండోవార్డు ఇన్‌చార్జి శిల్లా సరళారాణి ఆధ్వర్యంలో గురువారం 50 మంది పేద మహిళలకు చీరలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కరుణాకరరెడ్డి, చిల్ల సూర్యనారాయణరెడ్డి, చేట్ల ఎల్లయ్యరెడ్డి, చిల్ల గణేష్‌రెడ్డి, జగన్నాథ ఎల్లాజీ తదితరులు పాల్గొన్నారు.

గణపతి లడ్డూ @ రూ.20 వేలు



వేలంలో రూ.20వేలు ధర పలికిన లడ్డు

పద్మనాభం: మండలంలోని మద్ది జంక్షన్‌లో నిలిపిన వినాయక విగ్రహం వద్ద నివేదించిన రూ.20 కిలోల లడ్డూకు గురువారం సాయంత్రం వేలం పాట నిర్వహించారు. ఈ లడ్డూను రూ.20వేలకు మద్ది గ్రామానికి చెందిన కంటుబోతు నారాయణరావు పాడుకున్నారు. ఈ వేలం పాటను ఎంపీపీ కంటుబోతు రాంబాబు ప్రారంభించారు. రూ.1000తో వేలం పాట ప్రారంభం కాగా.. ఆఖరి పాటగా రూ.20వేలు ధర పలికింది. లడ్డూను కైవసం చేసుకునేందుకు 20 మంది పోటీ పడ్డారు. వైఎస్సార్ సీపీ మండల యువజన విభాగం అధ్యక్షుడు బుగత సత్యనారాయణ పాల్గొన్నారు.

బస్సు ప్రయాణికుల సమస్యల పరిష్కారానికి వినతి

తగరపువలస: సుదీర్ఘకాలంగా తగరపువలసలో బస్సు ప్రయాణికులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని సీపీఐ నాయకులు కోరారు. ఈ మేరకు భీమిలి ఏరియా సీపీఐ తరఫున జిల్లా కార్యవర్గ సభ్యుడు మరుపిళ్ల పైడిరాజు గురువారం ఆర్టీసీ రీజనల్ మేనేజర్ కార్యాలయంలో సహాయ మేనేజర్ సీహెచ్ పద్మావతికి వినతి పత్రం అందించారు. ఆయన మాట్లాడుతూ తగరపువలసలో ఆర్టీసీ కాంప్లెక్స్ నిర్మాణం 20 ఏళ్లుగా భూమి పూజల దగ్గరే ఆగిపోయిందన్నారు. ఇక్కడ కాంప్లెక్స్ నిర్మిస్తే ప్రయాణికుల సమస్యలు తొలగుతాయన్నారు నాయకులు పాల్గొన్నారు.



